

ఎన్నికల సంఘానికి రూ.306 కోట్లు


దిల్లీ: ఈ ఏడాది లోక్‌సభతో పాటు కొన్ని రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘాని(ఈసీ)కి 2024-25 బడ్జెట్‌లో కేంద్రం రూ.306.06 కోట్లు కేటాయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24)లో కేంద్రం రూ.385.67 కోట్లు ఇచ్చింది. న్యాయమంత్రిత్వ శాఖకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.2,502.30 కోట్లు ఇవ్వగా.. 2024-25లో రూ.34.84 కోట్లు కేటాయించింది. ఈ నిధుల్ని ఈవీఎంల సేకరణ కోసం ఎన్నికల సంఘానికి ఇవ్వనున్నారు. న్యాయమంత్రిత్వ శాఖ పరిధిలోని శాసన విభాగం ఈసీకి సంబంధించిన ఎన్నికలు, ఎన్నికల చట్టాల అంశాలకు నోడల్ ఏజెన్సీగా పనిచేస్తుంది.

పరిశోధనలకు రూ.లక్ష కోట్ల కార్పస్ ఫండ్

దిల్లీ: ప్రైవేటు రంగంలో పరిశోధనలు, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు రూ.లక్ష కోట్ల కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయనున్నట్లు నిర్మలా సీతారామన్ వెల్లడించారు. 'ఈ నిధితో.. 50 ఏళ్ల పాటు వడ్డీ లేని రుణాలు ఇచ్చి ఔత్సాహికులను ప్రోత్సహిస్తాం. దీర్ఘకాలిక ఫైనాన్సింగ్ లేదా రీఫైనాన్సింగ్, పూర్తిగా వడ్డీ లేకుండా సాయం చేస్తాం. యువత, సాంకేతికతను సమ్మిళితం చేసేలా.. సన్‌రైజ్ డొమైన్‌లో పరిశోధన, ఆవిష్కరణలో ఇది ఎంతగానో ఉపకరిస్తుంది' అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.



సాగు సాయం అంతంతే!



- కేటాయింపులు స్వల్పంగా పెంపు
- వంటనూనెల రంగంలో ఆత్మనిర్భరతకు ప్రణాళిక
- పాడిరైతుల కోసం సమగ్ర కార్యక్రమం
- అయిదు సమీకృత ఆక్వాపార్కుల ఏర్పాటు

దిల్లీ: వ్యవసాయం, అనుబంధ రంగాలకు గత ఏడాదితో పోలిస్తే నిధుల కేటాయింపులు స్వల్పంగా పెరిగాయి. 2023-24లో రూ.1.25 లక్షల కోట్లు ఇవ్వగా.. ఈసారి రూ.1.27 లక్షల కోట్లు కేటాయించారు. మత్స్య, పశుపోషణ, పాడి మంత్రిత్వ శాఖకు రూ.7,105 కోట్లు, ఆహార శుద్ధి పరిశ్రమల శాఖకు రూ.3,290 కోట్లు కేటాయించారు. వ్యవసాయ రంగంలో మరింత వృద్ధి కోసం పబ్లిక్, ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించనున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. రైతుల ఆదాయం పెంచేందుకు, వ్యవసాయ రంగంలో విలువ జోడింపునకు మరింత కృషి చేస్తామని పేర్కొన్నారు. బడ్జెట్ ప్రసంగంలో ఆమె పలు కీలక ప్రకటనలు చేశారు.

వ్యవసాయ రంగానికి కేటాయింపుల్లో కొన్ని.. (రూ.కోట్లలో)

శాఖ/రంగం	2023–24	2024–25
వ్యవసాయ పరిశోధన, విద్యా విభాగం	9,876	9,941
పీఎం–కిసాన్	60,000	60,000
మత్స్యశాఖ	1,701	2,584
పశుసంవర్ధక, పాడి పరిశ్రమలు	3,913	4,521
ఆహార శుద్ధి పరిశ్రమలు	2,911	3,290
సహకార శాఖ	747	1,183
ఆహార, ప్రజా పంపిణీ	2,21,924	2,13,019
వినియోగదారుల వ్యవహారాలు	309	303
ఎరువులు	1,88,947	1,64,150
రసాయనాలు	572	139
ఫార్మాసూటికల్స్	2,697	4,089

నూనెగింజల సాగుకు ప్రోత్సాహం


దేశీయంగా నూనెగింజల సాగును ప్రోత్సహించడం ద్వారా వంటనూనెల రంగంలో ఆత్మనిర్భరత సాధించేందుకు ఓ వ్యూహం రూపొందిస్తారు. భారత్ ప్రస్తుతం విదేశాల నుంచి పెద్దమొత్తంలో వంటనూనెలు దిగుమతి చేసుకుంటోంది. 2022 నవంబరు నుంచి 2023 అక్టోబరు వరకు (మార్కెటింగ్ సంవత్సరంలో) రూ.1.38 లక్షల కోట్ల విలువ చేసే సుమారు 165 లక్షల టన్నులు దిగుమతి చేసుకుంది. ఈ నేపథ్యంలో వేరుసెనగ, నువ్వులు, ఆవాలు, సోయా, పొద్దుతిరుగుడు సాగును ప్రోత్సహించేందుకు ప్రత్యేక వ్యూహం అమలు చేస్తారు. అధిక దిగుబడి ఇచ్చే వంగడాలపై పరిశోధన, ఆధునిక సాగు పద్ధతుల వినియోగం, మార్కెట్ అనుసంధానం, పంటల బీమా అందులో ఉంటాయి.

పాల ఉత్పాదకత పెంచేందుకు..

భారతదేశం ప్రపంచంలోనే అతి పెద్ద పాల ఉత్పత్తిదారుగా ఉంది. కానీ, పశువుల పాల ఉత్పాదకత తక్కువగా ఉంది. ఇప్పటికే ఉన్న రాష్ట్రీయ గోకుల్ మిషన్, నేషనల్ లైవ్ స్టాక్ మిషన్, డెయిరీ ప్రాసెసింగ్- పశుపోషణ కోసం 'మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధులు' వంటి పథకాల ఆధారంగా పాడి రైతులను ఆదుకునేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందిస్తారు.

11.8 కోట్ల మందికి 'పీఎం కిసాన్'

"పీఎం కిసాన్ యోజన కింద 11.8 కోట్ల మంది రైతులకు ఆర్థిక సాయం అందించారు. 4 కోట్ల మందికి పీఎం ఫసల్ బీమా అందించారు. ప్రధాన మంత్రి కిసాన్ సంపద యోజన కింద 38 లక్షల మంది రైతులు లబ్ధి పొందారు. 10 లక్షల మందికి ఉపాధి లభించింది. మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకం ద్వారా 2.4 లక్షల స్వయం సహాయక సంఘాలకు, వ్యక్తిగతంగా 60 వేల మందికి రుణసాయం అందించారు.



మత్స్య సంపద పెంపు..

ఆక్వా రంగంలో ప్రస్తుతం హెక్టారుకు 3 టన్నుల మత్స్య సంపద ఉత్పత్తి అవుతోంది. దీన్ని 5 టన్నులకు పెంచేందుకు, ఎగుమతులను రెట్టింపు అంటే రూ.లక్ష కోట్లకు పెంచేందుకు, సమీప భవిష్యత్తులో 55 లక్షల మందికి ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు ప్రధాన మంత్రి మత్స్య సంపద పథకం అమలును ముమ్మరం చేస్తారు. అయిదు సమీకృత ఆక్వాపార్కులు ఏర్పాటు చేస్తారు. నానో యూరియా విధానం విజయవంతమైన నేపథ్యంలో నానో లిక్విడ్ డీఏపీ వినియోగాన్ని అన్ని అగ్రో-క్లైమేటిక్ జోన్లకు విస్తరిస్తారు.



బడ్జెట్ సమగ్ర స్వరూపం (రూ.కోట్లలో)

	2022–2023 వాస్తవ గణాంకాలు	2023–2024 బడ్జెట్ అంచనాలు	2023–2024 సవరించిన అంచనాలు	2024–2025 బడ్జెట్ అంచనాలు
1. రెవెన్యూ వసూళ్లు	23,83,206	26,32,281	26,99,712	30,01,274
2. పన్ను ఆదాయం	20,97,786	23,30,631	23,23,918	26,01,574
3. పన్నేతర ఆదాయం	2,85,421	3,01,650	3,75,795	3,99,701
4. మూలధన వసూళ్లు	18,09,951	18,70,816	17,90,773	17,64,494
5. రుణాల తిరిగి వసూళ్లు	26,161	23,000	26,000	29,000
6. ఇతర మూలధన వసూళ్లు	46,035	61,000	30,000	50,000
7. అప్పులు, ఇతర వసూళ్లు	17,37,755	17,86,816	17,34,773	16,85,494
8. మొత్తం వసూళ్లు	41,93,157	45,03,097	44,90,486	47,65,768
9. మొత్తం వ్యయం	41,93,157	45,03,097	44,90,486	47,65,768
10. రెవెన్యూ ఖాతా	34,53,132	35,02,136	35,40,239	36,54,657
11. వడ్డీ చెల్లింపులు	9,28,517	10,79,971	10,55,427	11,90,440
12. మూలధన ఆస్తుల కోసం కేటాయించిన గ్రాంట్లు	3,06,264	3,69,988	3,21,190	3,85,582
13. మూలధన ఖాతా	7,40,025	10,00,961	9,50,246	11,11,111
14. రెవెన్యూ లోటు (10-1)	10,69,926 (3.9%)	8,69,855 (2.9%)	8,40,527 (2.8%)	6,53,383 (2.0%)
15. ప్రభావిత రెవెన్యూ లోటు (14-12)	7,63,662 (2.8%)	4,99,867 (1.7%)	5,19,337 (1.8%)	2,67,801 (0.8%)
16. ద్రవ్య లోటు9-(1+5+6)	17,37,755 (6.4%)	17,86,816 (5.9%)	17,34,773 (5.8%)	16,85,494 (5.1%)
17. ప్రాథమిక లోటు (16-11)	8,09,238 (3.0%)	7,06,845 (2.3%)	6,79,346 (2.3%)	4,95,054 (1.5%

కొంచెం కొంచెం కోత పెట్టేయ్!

ఆహారం, ఎరువులపై రాయితీల్లో తగ్గుదల

దిల్లీ: ఆహారం, ఎరువులపై ఇస్తున్న రాయితీల్లో కేంద్ర ప్రభుత్వం ఏడాదికేడాదికీ కోత విధిస్తూ వస్తోంది. 2024-25కి ఆహారం, ఎరువులపై రాయితీలను రూ.3.69 లక్షల కోట్లుగా నిర్ణయించింది. మార్చి 31, 2024తో ముగిసే ఆర్థిక సంవత్సరంలో సవరించిన అంచనాలతో పోలిస్తే ఇది 8 శాతం తక్కువ. వచ్చే ఏడాది ఆహార సబ్సిడీ కోసం రూ.2,05,250 కోట్లను ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కేటాయించారు. ఈ ఆర్థిక సంవత్సరం సవరించిన అంచనాల ప్రకారం ఆహారంపై రాయితీ రూ.2,12,322 కోట్లు. ఇది 2022-23లో రూ.2.72 లక్షల కోట్లు కావడం గమనార్హం. వచ్చే ఏడాది ఎరువులపై ఇవ్వనున్న రాయితీలను రూ.1.64 లక్షల కోట్లుగా నిర్ణయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సవరించిన అంచనాల ప్రకారం... రాయితీ రూ.1.89 లక్షల కోట్లు. గత ఏడాది రూ.2.51 లక్షల కోట్లను ఎరువులపై సబ్సిడీల కోసం కేటాయించారు.



వచ్చే ఏడాదికి పెట్రోలియంపై ఇచ్చే రాయితీని రూ.11,925 కోట్లుగా నిర్ణయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సవరించిన అంచనా (రూ.12,240 కోట్లు)తో పోలిస్తే ఇది తక్కువ.

లఖ్‌పతితో లక్షార్జన!



3 కోట్ల మంది మహిళలకు నైపుణ్య శిక్షణ

దిల్లీ: స్వయం సహాయక సంఘా(ఎస్‌హెచ్‌జీ)లకు సంబంధించిన 'లఖ్‌పతి దీదీ' పథక లక్ష్యాన్ని విస్తృతం చేస్తున్నారు. ఇకపై 3 కోట్ల మంది మహిళలకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇవ్వనున్నట్లు కేంద్ర ఆర్థికమంత్రి వెల్లడించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమే లక్ష్యంగా స్వయం సహాయక మహిళలకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి.. వారు ఏడాదికి కనీసం రూ.లక్ష స్థిర ఆదాయం పొందేలా చేయడమే పథక లక్ష్యం. 'తొమ్మిది కోట్ల మహిళల సభ్యత్వంతో 83 లక్షలు ఉన్న ఎస్‌హెచ్‌జీలు గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఆర్థిక స్వావలంబనకు ఉపకరిస్తున్నాయి. ఈ సంఘాలతో ఇప్పటికే కోటి మంది మహిళలు లక్షాధిపతులయ్యారు. వీరు ఇతరులకూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. గణతంత్ర దినోత్సవం నాడు ప్రధాని మోదీ 'లఖ్‌పతి దీదీ' కింద 2 కోట్ల మంది మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వాలని పిలుపునిచ్చారు. వీరు సాధించిన విజయాలు, మహిళల సంఘటిత స్ఫూర్తి చూసి 'లఖ్‌పతి దీదీ' లక్ష్యాన్ని 2 కోట్ల నుంచి 3 కోట్లకు నిర్దేశించుకున్నాం' అని నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఈ పథకం కింద మహిళలకు డ్రోన్ ఆపరేటింగ్, ఎల్‌ఈడీ బల్బుల తయారీ వంటి పనుల్లో శిక్షణ ఇస్తారు.

బయోమాస్‌ను సీబీజీగా మార్చేందుకు ఆర్థిక సాయం

బయోమాస్‌ను కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ)గా మార్చేందుకు ఆర్థిక సాయం అందించనున్నట్లు ఆర్థికమంత్రి ప్రకటించారు. వాహనాలు, దేశీయ సరఫరాల కోసం ఇంధనంగా వినియోగించేందుకు సహజ వాయువులో తప్పనిసరిగా సీబీజీ కలపడాన్ని దశలవారీగా అమలు చేయనున్నట్లు వెల్లడించారు. దేశ ఇంధన భద్రతకు మద్దతు ఇచ్చే లక్ష్యంతో ఈ పథకాన్ని తీసుకొచ్చారు. బయోమాస్ అగ్రిగేషన్ పరికరాలు సమకూర్చుకునేందుకు ఆర్థిక సాయం కల్పిస్తామని అన్నారు. హరిత వృద్ధిని ప్రోత్సాహించేందుకు బయో తయారీ, బయో-ఫౌండ్రీ పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు.

జలంతోనే జీవనమని!

జల్‌జీవన్ మిషన్ మరింత బలోపేతం



తాగునీటి సదుపాయ కల్పనకు కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. 2024-25 తాత్కాలిక బడ్జెట్‌లో జల్‌శక్తి మంత్రిత్వ శాఖకు రూ.98,418 కోట్లను కేటాయించారు. ఇందులో 71 శాతం నిధులు 'జల్ జీవన్ మిషన్' కోసం వెచ్చిస్తారు. జల్ జీవన్ మిషన్‌లో భాగంగా దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ నల్లా నీటి సౌకర్యాన్ని కల్పించనున్నారు. 2023-24 బడ్జెట్‌లో జల్‌శక్తి మంత్రిత్వ శాఖకు రూ.96,549 కోట్లు కేటాయించారు.

- 'జాతీయ గంగా ప్రణాళిక' కింద గంగ, దాని ఉపనదులకు సంబంధించి చేపట్టే ప్రాజెక్టులు, పథకాల అమలు కోసం రూ.3,500 కోట్లను, ప్రధాన మంత్రి క్రిషి సించాయీ యోజనకు రూ.2,500 కోట్లను తాత్కాలిక బడ్జెట్‌లో కేటాయించారు.

ఆదాయపు పన్ను ఏం మారలే!



ఉద్యోగులకు దక్కని ఊరట

ఈనాడు, హైదరాబాద్: ఎన్నికల ముందు ప్రవేశ పెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో ఉద్యోగులకు ఊరట కల్పించే అంశాలేమీ కనిపించలేదు. 'గత సంప్రదాయాన్ని కొనసాగిస్తూ.. మధ్యంతర బడ్జెట్‌లో కొత్త పన్ను ప్రతిపాదనలేమీ తీసుకురావడం లేదని' ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. దిగుమతి సుంకాలు సహా ప్రత్యక్ష, పరోక్ష పన్నుల విధానంలో ఎలాంటి మార్పులూ ఉండవని ప్రకటించారు. 'గత పదేళ్లలో ప్రత్యక్ష పన్నుల వసూళ్లు మూడు రెట్లు పెరిగాయి. రిటర్నులు దాఖలు చేసేవారి సంఖ్య 2.4 రెట్లు అధికమయ్యింది. పన్ను చెల్లింపుదారుల ప్రతి రూపాయినీ దేశాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికీ ఉపయోగిస్తున్నామని నేను హామీ ఇస్తున్నా. పన్ను చెల్లింపుదారులు ప్రభుత్వానికి ఇస్తున్న మద్దతుకు నేను అభినందనలను తెలియజేస్తున్నా' అని ఆమె అన్నారు. పదేళ్లలో ప్రభుత్వం పన్ను రేట్లను తగ్గించినట్లు, హేతుబద్ధీకరించినట్లు తెలిపారు. '2013-14 ఆర్థిక సంవత్సరంలో మినహాయింపు పరిమితి రూ.2.2 లక్షలు ఉండేది. ఇప్పుడు కొత్త పన్నుల విధానంలో రూ.7 లక్షల వరకూ ఆదాయం ఉన్న వారికీ ఎలాంటి పన్ను బాధ్యత లేదు. చిన్న వ్యాపారుల పన్ను పరిధినీ రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్లకు పెంచాం. వృత్తి నిపుణుల ఆదాయ పరిమితినీ రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల వరకూ పెంచాం. కార్పొరేట్ పన్నునూ 30 శాతం నుంచి 22 శాతానికి తగ్గించాం. కొన్ని దేశీయ కంపెనీలకూ, కొన్ని కొత్త తయారీ కంపెనీలకూ ఇది 15 శాతమే' అని సీతారామన్ తెలిపారు.

10 రోజుల్లోనే పరిశీలన..

గత అయిదేళ్లలో పన్ను చెల్లింపుదారుల సేవలను మెరుగుపర్చడంపై దృష్టి సారించామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఫేస్‌లెస్ అసెస్‌మెంట్ అప్పీల్‌ను ప్రవేశ పెట్టడంతో పారదర్శకత, జవాబుదారీతనం పెరిగిందన్నారు. నవీకరించిన ఆదాయపు పన్ను రిటర్నులు, కొత్త ఫారం 26ఏఎస్, పన్ను రిటర్నులను ముందుగానే నింపడం లాంటి వాటి ద్వారా రిటర్నుల దాఖలు మరింత సులభమయ్యిందని పేర్కొన్నారు. రిటర్నుల పరిశీలనకు 2013-14లో సగటున 93 రోజులు పట్టేదని, ఇప్పుడు కేవలం 10 రోజుల్లోనే ఇది పూర్తవుతోందని తెలిపారు. దీనివల్ల రిఫండుల చెల్లింపు వేగంగా పూర్తవుతోందన్నారు.

నోటీసుల ఉపసంహరణ..

వివాదాస్పదమైన ప్రత్యక్ష పన్ను డిమాండ్లు పెద్ద సంఖ్యలో ఉన్నాయని ఆర్థిక మంత్రి తెలిపారు. '1962 నుంచి ఇవి ఇంకా పుస్తకాల్లో కొనసాగుతూనే ఉన్నాయి. నిజాయతీతో పన్ను చెల్లిస్తున్న వారికి ఇవి ఆందోళన కలిగిస్తున్నాయి. తదుపరి సంవత్సరాల్లో రిఫండుకూ ఇబ్బంది అవుతోంది. ఈ నేపథ్యంలో 2009-10 ఆర్థిక సంవత్సరం వరకూ ఉన్న రూ.25వేల లోపు డిమాండు నోటీసులనూ, 2010-11 నుంచి 2014-15 వరకూ ఉన్న రూ.10 వేల లోపు ప్రత్యక్ష పన్ను బకాయి డిమాండు నోటీసులను ఉపసంహరించుకోవాలని ప్రతిపాదిస్తున్నా' అని సీతారామన్ తెలిపారు. దీనివల్ల కోటి మంది ప్రయోజనం పొందుతారని వెల్లడించారు. వీరందరూ రూ.3,500 కోట్ల మేర లబ్ధిపొందుతారని కేంద్ర రెవెన్యూ శాఖ కార్యదర్శి సంజయ్ మల్హోత్ర వెల్లడించారు.



పల్లె ప్రగతికి పెద్దపీట

గ్రామీణాభివృద్ధికి కేటాయింపుల పెంపు

దిల్లీ: గ్రామీణాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. 2024-25 తాత్కాలిక బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖకు రూ.1.77 లక్షల కోట్లను కేటాయించింది. 2023-24తో ఇచ్చిన రూ.1.57 లక్షల కోట్లతో పోలిస్తే ఇది 12 శాతం ఎక్కువ. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కోసం రూ.86,000 కోట్లను కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. గత బడ్జెట్‌లో ఇచ్చిన నిధులు రూ.60,000 కోట్లతో పోలిస్తే 43 శాతం ఎక్కువ కేటాయించడం విశేషం. ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజనకు ఈసారి నిధుల్ని తగ్గించారు. 2024-25 తాత్కాలిక బడ్జెట్‌లో ఆ పథకానికి రూ.12,000 కోట్లను ప్రకటించారు. గత బడ్జెట్‌లో కేటాయింపులు రూ.19,000 కోట్లు.

యూపీఏ పాలన నుంచి గుణపాఠాలు నేర్చుకుందాం!

దిల్లీ: 2014కు పూర్వం ఆర్థిక వ్యవస్థ నిర్వహణ లోపాలపై శ్వేతపత్రం విడుదల చేయనున్నట్లు నిర్మలా సీతారామన్ వెల్లడించారు. పదేళ్ల యూపీఏ ప్రభుత్వం తర్వాత 2014లో భాజపా ఆధ్వర్యంలో ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చింది. '2014కు పూర్వం మనం ఎక్కడున్నాం. ఇప్పుడు ఎక్కడున్నామో తెలుసుకోవడం ఎంతో ముఖ్యం. ఆనాడు యూపీఏ పాలకుల విధానాల వల్ల కలిగిన నష్టాల నుంచి గుణపాఠాలు నేర్చుకునేందుకు శ్వేతపత్రం అవసరం' అని కేంద్ర మంత్రి వివరించారు. ఈ పదేళ్ల కాలంలో ఆర్థిక వ్యవస్థలో సానుకూల మార్పు వచ్చిందని నొక్కి చెప్పారు. దేశ ప్రజలూ ఆశావహ దృక్పథంతో ఉన్నారన్నారు. 'మోదీ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించే నాటికే దేశం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. 'సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్' ఓ మంత్రంలా అమలు చేయడంతో వాటిని అధిగమించాం. దేశం మొత్తం ఏకతాటిపై నిలిచి కరోనా వంటి ప్రతికూలతలను ఎదిరించి నిలదొక్కుకున్నాం. 'పంచ్ ప్రాణ్'తో ఏకమై ఆత్మనిర్భర్ భారత్ వైపు అడుగులు వేసి 'అమృత్ కాలం' కోసం పునాదులు వేసుకున్నాం. అందుకే.. ప్రభుత్వ పనితీరు చూసి మళ్లీ ఆశీర్వదిస్తారని భావిస్తున్నా' అని పేర్కొన్నారు. ప్రభుత్వ సీనియర్ అధికారుల వివరాల మేరకు వచ్చే వారమే శ్వేతపత్రం విడుదల చేయవచ్చని తెలిసింది.

ఉడాన్‌లో 517 మార్గాలు

దిల్లీ: పెరుగుతున్న ప్రయాణికులకు అనుగుణంగా ప్రస్తుత విమానాశ్రయాల విస్తరణ, కొత్త విమానాశ్రయాల అభివృద్ధిని వేగంగా కొనసాగిస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. గత పదేళ్లలో విమానాశ్రయాలు రెట్టింపై 149కు చేరాయని తెలిపారు. దేశీయ సంస్థలు 1120 కొత్త విమానాలకు ఆర్డర్లు పెట్టినట్లు గుర్తు చేశారు. చిన్న పట్టణాలకు విమానాలు నడిపేందుకు అమలు చేస్తున్న ప్రాంతీయ వాయు అనుసంధానత పథకం (ఉడాన్) కింద వాయు ప్రయాణాలను మరింత అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ఎఫ్ఎం తెలిపారు. ఈ పథకం కింద 517 కొత్త మార్గాల్లో 1.3 కోట్ల మంది ప్రయాణించారని వివరించారు.

నిధులు ఇలా: 2024-25లో పౌర విమానయాన మంత్రిత్వ శాఖకు రూ.2,300 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు. 2023-24లో ఈ శాఖకు సవరించిన అంచనా రూ.2,922.12 కోట్ల కంటే ఈ మొత్తం తక్కువే. ఉడాన్‌కు 2024-25లో రూ.502 కోట్లు కేటాయించారు. 2023-24లో సవరించిన అంచనాలు రూ.850 కోట్ల కంటే ఇది తక్కువ. 22 విమానాశ్రయాలను పునరుద్ధరించడం, 124 వాయు మార్గాలను ప్రారంభించడంతో పాటు ఈశాన్య ప్రాంతాల అనుసంధానత కోసం, వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కోసం తాజాగా కేటాయించిన నిధులను వినియోగించనున్నారు.

'జనాభా పెరుగుదల- సవాళ్ల'పై ఉన్నత స్థాయి కమిటీ

దిల్లీ: వేగంగా జనాభా పెరుగుదల, అందులో మార్పుల వల్ల ఎదురవుతున్న సవాళ్లను అధ్యయనం చేసేందుకు ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. 'వికసిత్ భారత్' లక్ష్యాలను చేరుకునేందుకు ఉన్న సవాళ్లను కమిటీ తప్పనిసరిగా గుర్తించాల్సి ఉంటుందన్నారు.

అప్పు చేయాల్సిందే!

రెవెన్యూ లోటును పూడ్చేందుకు రూ.14.13 లక్షల కోట్ల రుణాలు

దిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఏర్పడే రెవెన్యూ లోటును పూడ్చుకునేందుకు రూ.14.13 లక్షల కోట్ల రుణాల్ని తీసుకోనున్నట్లు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించారు. 2023-2024 ఆర్థిక సంవత్సరం స్థూల రుణ అంచనా రూ.15.43 లక్షల కోట్లతో పోలిస్తే ఇది తక్కువే. వచ్చే ఏడాది పన్నుల ద్వారా రాబడి పెరుగుతుందని భావిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఆ మేరకు రుణ సేకరణను తగ్గించుకుంది.